# 6
# ఇస్తారి

" నీకు ఇయ్యాల్ల చాతగాదు. ఇంటికాన్నే ఉండు. ఈ గోలీలు ఏసుకో. పగటిల్లి  పొల్లగాండ్లత్తరు. పెద్దది కడుపు నొత్తుందంటే ఈ పొట్లంలున్న ఎర్రగోలెయ్యి. దిబ్బడ దబ్బడ గుద్దకు. బుదురకిచ్చి బడికి తోలు. లేకుంటే బియ్యం ఇయ్యరు."

" ఆ....నువ్వే నొప్పులు తీసి కంటివి. నాకేం ఎరుకుంటది. దిబ్బడ దబ్బడ ఎందుకు గుద్దుత? ఓ నారాయణా... నడువవోదామంటే ఓసర లేనట్టునేనున్న. అది ఎన్ని రోజులాయె కడుపు నొప్పి అనవట్టి? ఆ ఎర్రగోలీలు పచ్చ గోలీలు పని జేత్తయా..."

" ఎర్రయి పచ్చయి గాక ఎందేత్తరు ! ఇంటెనుక పైసల చెట్టుండు గదా మంచిగుండు. తెంపుకచ్చి పెదుదుంటిని."

" ఔ....నువ్వు చిన్నపెట్టుడా ! మమ్ముల్ని కూసుండవెట్టి సాదవడితివి. మూడు రోజులాయె మంచం పట్టి. ఎన్ని మందులు దెచ్చినవట....?"

" ఆ...... కూసుండవెట్టి సాదకపోతే నువ్వు జేత్తె పలిగిపోతుంది తియ్యి......నాలుగు రోజులు నాకు కైకిలి దొరుకుతలేదేమో......తిండికే తిప్పలైతుంది. ఈ రెక్కలున్నంత సేపే తిండి. రెక్కలిరిగిన్నాదు మూరెడు తాడే దిక్కు......" ఇంకా వాదనకు దిగే వాడే ఇస్తారి. అప్పటికే పొద్దువోయింది. తువ్వాలను దులుపుకుని భుజం మీదేసుకుని గుడిసెలోంచి వంగివంగి బయటకచ్చిండు.

“ ఇంటికి రాంగ వరకు కాయిదం కొనుక్కరా. అయిటి మూనింది. ఒక్కవాన పడిందనుకో....గుడిసె తోపుతోపునానుతది. సలికి వణికి సచ్చుడే ఐతది.” గొణుక్కున్నట్టుగా అన్నది నాగవ్వ. ఆ మాటల్ని గట్టిగా అనడానిక్కూడా శక్తి లేదు.

‘ ఔను. వరకు కాయిదం తెచ్చి గుడిసెమీద కప్పాలె. ఈ వానకాలం ఎట్లెల్లుతదో ’ అనుకుంట రోడ్డు మీద నడుత్తున్నడు ఇస్తారి. అలవాటుగా కాళ్లు లేబర్ అడ్డాదిక్కు దారి తీసినయి. ఎండ మండుతున్నా వాన రావడానికి గుర్తుగా నల్లటి మబ్బులు తేలిపోతున్నయి. అవి ఇస్తారి మనసులో కొంత దిగులును బుగులును పుట్టిస్తున్నయి.

‘ ఇయ్యల్ల ఏదన్న పని దొరికిచ్చుకోవాలె. వారం రోజులాయే. వట్టిగనే తిరిగి వచ్చుడు గావట్టే. నన్ను సూత్తేసాలు. పామును చూసినట్టు దూరం పోతుండ్రు. ’ బీడిని ముట్టించి తాగుతూ వడివడిగా అడ్డావైపు అడుగులేసిండు.

“ అగో.....సావు బతుకులోడు వత్తుండు. వీడు ఎన్నడో బంగ్లమీద నుంచి గాలికే కిందికి రాలి పిట్టపిల్లలెక్క నోరుదెరుత్తడు. ” ఎవలో అన్నరు ఇస్తారిని చూసి.

ఉన్నోల్లంతా కిసుక్కున నవ్విండ్రు. వారి చూపులు అక్కెరకు రాని వస్తువును దేనినో చూస్తున్నట్టుగ వున్నయి. ఇస్తారి మనసు బాధపడ్డది. ఎంత వైరాగ్యంగా ఆలోచించినా ఏదో ఒక మూల అసహనం. కళ్లు పెద్దగా చేసి చాతీవిరిచి నిలబడ్డడు. మనసులోని బాధను కప్పిపుచ్చుకోవడానికంటూ అందరివైపూ గుడ్లురిమి చూసిండు.

ఆడా,మగా, పిల్లలూ ముసలివాళ్లూ....గుంపులు గుంపులుగా కూలీజనం. రోడ్డు పక్కన, దుకాణం మడిగెలమీద, చెట్టుకింద నిలవడి ఆశగా చూస్తున్నరు. పరిచయం ఉన్నవాళ్లు, తెలిసిన కంట్రాక్టర్లు కనిపిస్తే ఆశగా పలకరిస్తున్నరు. వాహనాల మీద వెళ్లేవారు విసుగ్గా బ్రేకుల్ని తొక్కుతున్నరు.

చుట్టూ ఒకసారి జూసి వేపచెట్టు మొదట్లోకి చేరుకున్నడు ఇస్తారి. “ థూ..... దునియపాడుగాను. పూర్తిగా చెడిపోయింది. కొంగులు సింగులు సదురుకుంట వాడు వచ్చేవరకు ఎట్లఎదురుంగ పోతండ్రు సూడు. వాడైతే దుక్కిల దున్నపోతు లెక్క బలిసిండు” ఎవలో అన్నరు. ఆ మాటల్లో కూలీ అవకాశాలన్నీ ఆడవాళ్లే తన్నుకుపోతున్నరన్న కోపం వుంది.

అక్కడక్కడా ఆడకూలీలు జట్లు జట్లుగా కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్నరు. వాళ్ళను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నరు. సత్తయ్య స్కూటర్ చుట్టయితే ఈగల లెక్క మూగిండ్రు.

అంగట్లకు పశువులలెక్క ఒక్కొక్కరు కూలీలు చేరుకుంటున్నరు. వచ్చిన వారిలో కొందరికి కూలీ దొరికి వెళ్లిపోతున్నరు. పక్కనే హారన్‌ల మోత. వాహనాల రోద. ఇవేవీ గమనించడం లేదు ఇస్తారి. వెకిలిగా నవ్వుతున్న సత్తయ్యను, బతిమిలాడుతున్న ఆడవాళ్లను చూస్తున్నడు.

ఐదేండ్ల కిందట.....మొదటిసారిగా చూసినప్పటి సత్తయ్య రూపం కండ్లముందు కదిలింది.

అప్పటికీ ఇప్పటికీ అతడిలో వచ్చిన మార్పు ఇస్తారిని ముల్లులెక్క గెలుకుతుంది. అందరి శరీరాల్లోని రక్తమాంసాలను తానొక్కడే పీల్చుకున్నట్టు దిట్టగా, తాను విసిరే మెతుకులతోనే బతుకుతున్నారన్నంత ధీమాగా స్కూటర్ మీద కూసుండి బ్యారమాడుతున్నడు.

పొద్దు మరింత పైకెక్కింది. కూలీల్లో ఉరుకులు పరుగులు మొదలయినయి. కూసుంటే లాభం లేదని లేచి ముందుకు కదిలిండు ఇస్తారి. ‘ ఎట్లనన్న బతిమిలాడాలె. ఎట్లనన్న మస్కగొట్టాలె. కైకిలు సంపాయించాలె ’ అనుకున్నడు. మందిని తోసుకుంటూ రోడ్డు దాటిండు ఇస్తారి.

పక్కనే సర్రుమన్న సప్పుడు. అడుగు దూరంలో ఆగింది స్కూటర్. ‘ ఏంది పటేలా..... కండ్లు కనవడుతలేవ్వా. జెర ఎనుకముందు సూసుకుంట నడుపు. అసలే కట్టెపుల్ల లెక్కున్నవు.’ వెటకారంగా నవ్వుతూ వెళ్లిపోయింది స్కూటర్.

ఇదేమీ పట్టించుకోకుండా సత్తయ్య ముందుకు వెళ్ళి నిలబడ్డడు ఇస్తారి. అప్పటికే ముగ్గురు ఆడకూలీలను ఇద్దరు తాపీ మేస్త్రీలను ఆటోలో ఎక్కించి అడ్రస్ చెపుతున్నడు సత్తయ్య. ఇస్తారిని చూసి మొకం తిప్పుకున్నడు.

‘ నేను ఎంబడేసుకుని పనినేర్పిన. నాసద్దిల సగం బువ్వవెట్టిన. ఇంటినుంచి అలిగచ్చి ఆగమై తిరుగుతుంటే చేతవట్టిన. ఇయ్యల్ల వీనిక్కూడా పనికి రాకుండైపోయిన ’ మనుసులోనే అనుకుంటూ బతిమిలాడిండు ఇస్తారి. వినిపించుకోకుండానే వెళ్లిపోయిండు సత్తయ్య.

అంగట్లకు వచ్చి బలంగా కండపట్టి ఉన్న పశువుల్నే కొనుక్కపోయినట్టు కాంట్రాక్టర్లు బలంగా ఉన్న మనుషుల్నే కూలీకి మాట్లాడుకుంటున్నరు. కొత్తగా ఇండ్లు కట్టేవారు, ఇంటి మరమత్తులు చేసేవారు, బాయిలు తవ్వించే వారు, బాయి పూడికలు తీయించేవారు..... రకరకాల పనులు చేసే కూలీలు పనుల కొరకు అక్కడికే వస్తరు.

సత్తయ్య వెళ్లిన వైపే దిగులుగా చూస్తుండిపోయిండు ఇస్తారి. అప్పుడే ముగ్గురు కాంట్రాక్టర్లు ఒకేసారి వచ్చి బిల్డింగ్ స్లాబ్ పోయడానికి కూలీలు కావాలనడంతో అందరూ వాళ్ల చుట్టూ మూగిపోయింద్రు. అప్పుడే చలనం వచ్చినట్టు ఇస్తారి వాళ్లలో కలిసిపోయిండు.

బేరసారాలు అయినయి. స్లాబ్ పోసుడు ఒక రోజులోనే పూర్తి కావాలె. గంట రెండుగంటలు లేటయినా పని పూర్తి చేయాలని ఎక్కువ కూలీ అడుగద్దని కట్టడి చేసుకున్నరు కాంట్రాక్టర్లు. కూలీలు జట్లు జట్లుగా విడిపోయి వారి వెంట నడుస్తున్నరు. అందరి మొకాల్లోనూ ఏదో రిలీఫ్ ! అబ్బా ఈ రోజు గడిచిందిలే అన్న భావన.

చూడరాని వస్తువేదో చూసినట్టుగా వెనక్కి తిరిగి అసహ్యంగా మొకం పెట్టి చూపుడు వేలితో పక్కకు జరుగు అన్నట్టుగా సైగ చేసిండు కంట్రాక్టరు. తనను కాదన్నట్టుగానే చూసి చూడనట్టుగా ముందుకు అడుగు వేసిండు ఇస్తారి.

“ ఆ.....సాలు. నీ అసొంటోళ్లు పదిమంది వత్తే నేను పోగు పోసినట్టే. జరుగు జరుగు... నువ్వు చేస్తే అయ్యే పని కాదది” వెనక్కి వచ్చి పక్కకు గుంజిండు కంట్రాక్టరు.

ఒకప్పుడు అదే చేత్తో గుంజి ‘ భీమునోలున్నవు. పని మీద పట్టు వదుతవు. ఆ పని నీ తోనే ఐతదిరా.’ అని తోలుకపోయిన వాడె !

కంట్రాక్టర్ మొకంలకు గోసోలె చూసిండు ఇస్తారి. అంతకంటే కఠినంగా తన నిర్ణయం మారదన్నట్టుగా చూసిండు అతడు.

ఇస్తారి పక్కకు జరిగి నిలబడ్డడు. కూలీలు అతడిని దాటుకుని వెళ్లిపోయింగ్రు. చూసిన ఒకరిద్దరు ‘ వాదుగట్లనే అంటడు. మొండికి ఎంటపోతే నాలుగు తిట్టి ఊకుంటడే. రా ఇత్తారన్నా ! అంబటాల్లయింది. ఇప్పుడు ఎవలూ పిలువరు. ఇంటికి ఎల్లిపోవుడే ’ అన్నరు.

మొండిగా వారి వెంట వెళ్లడానికి ఇష్టం కాలేదు ఇస్తారికి. గొణుక్కుంటూ వెనకనే వస్తున్న మరో మందలో కలవడానికి ప్రయత్నించిండు. వెనకగా ఆడవాళ్లతో వస్తున్న కాంట్రాక్టర్ గుర్తు పట్టిండు.

“ అరేయ్....నువ్వు యాడికిరా.....నర్సొక్కులోనివి. పనిజేత్తవా.... జరుగు జరుగు. సందెన బద్దలెక్కున్నడు...అంత్రం మీద మాలందిత్తడట ” విసుగ్గా అన్నడు కంట్రాక్టర్.

ఎవలో కిసుక్కున నవ్వింగ్రు. కొందరు ఊరడింపుగా చూస్తున్నరు. కొందరు ‘ ఔమరి. వీడు పని జేత్తడా ! నడిత్తెనే సొలుగుతడు ’ అన్నరు. ఒకరిద్దరు ‘ భీమునసొంటి మనిషి, కట్టెపుల్లయిండు ’ అన్నరు. లోతుగా ఆలోచించేవారు ‘ రేపు మనగతి కూడా ఇంతే ’ అనుకున్నరు.

బతుకు పోరులో ముందుకు పోతున్న సైనికుల్లా కూలీల గుంపు పోతుంది. కూలీల వైపు లోతుగా చూస్తున్నడు ఇస్తారి. తనకంటే ముందునుంచే ఉన్నవాళ్లు, తనతో చేరిన వాళ్లు, తర్వాత వచ్చిన వాళ్లు.

అందరూ తనను వెలివేసినట్టు.....తనచుట్టూ గీతగీసి వెళ్తున్నట్టు అనిపించింది. నీరసంగా వెళ్లి చెట్టు మొదట్లో కూసున్నడు. అప్పటికే చాలామంది ఖాళీ అయ్యింగ్రు. మిగిలిన వారు చెట్టు చుట్టూ మూగింగ్రు. దుకాణాలు ఒక్కొక్కటి తెరుచుకున్నయి.

రోడ్డు మీద రద్దీ పెరిగిపోయింది. ఆగిన ప్రతీ స్కూటర్ వైపు వచ్చిన మనుషులవైపు ఆశగా చూస్తున్నడు. ఒకరిద్దరు ఆడకూలీల కొరకు వచ్చింగ్రు. తాను వస్తానని ఆడవాళ్లకు ఇచ్చే కూలీ ఇయ్యుమని బతిమిలాడిండు ఇస్తారి. వాళ్లు నవ్వుకుంట ఎల్లి పోయింగ్రు.

వేపచెట్టు నీడ మరింత చిన్నదైంది. చుట్టూ వున్న కూలీలు మరింత దగ్గరయింగ్రు. అంతవరకూ దుకాణం మడిగెలమీద కూసున్నోళ్లు అవి తెరవడంతో చెట్టుకిందికి వచ్చి ంగ్రు. పక్కనే మురికి కాలువ పారుతుంది. కాలువ పక్కన చింపిరి జుట్టు, చిరిగిన బట్టలతో ఇద్దరు వ్యక్తులు శాస్త్రవేత్తల్లా

మురుగు నీటి మట్టిని జల్లిస్తున్నరు. పందులు, కుక్కలు కొట్లాడుకుంటున్నయి.

ఎడమవైపు చౌరస్తాలో ట్రాఫిక్ లైట్లు ఆగి ఆగి వెలుగుతున్నయి. ఫైరింజన్ ఒకటి గంట కొట్టుకుంటూ వేగంగా వెళ్లిపోతుంది. కుడివైపు ఉన్న హాస్పిటల్‌లోకి అంబులెన్స్ పరుగులు తీసింది.

హారన్‌ల మోత, మోటార్ల చప్పుళ్ల మధ్య తన ఉనికిని తానే వెదుక్కున్నట్టు ఎప్పుడో మరిచిన జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ గొగ్గాల్ల మీద కూసున్నడు ఇస్తారి. పుల్లతో మట్టిని కెలుకుతున్నడు. ఈ రోజు కూడా పని దొరకదని తేలిపోయింది. ఈ రోజు కాదు..! ఏ రోజు కూడా దొరకదనుకున్నడు.

ఊరు ఉన్న ఎకురం పొలాన్ని మింగింది. బతుకలేక ఇక్కడికి వచ్చిండు. ఈ పట్నం రక్తమాంసాలను మింగింది. ఇక్కడినుండి బతుకుదెరువుకు ఎక్కడికి పోవుడు ?

ఆలోచనలు గజిబిజిగా వున్నయి. బీడి ముట్టించి దమ్ములాగి వదిలిండు ఇస్తారి. సత్తయ్య స్కూటర్ మళ్లీ వచ్చింది. చుట్టూ మూగిన కూలీలకు ఏదో చెబుతున్నడు.

ఇస్తారిలో చలనం వచ్చింది. బీడీని పక్కకు విసిరి సత్తయ్య ముందుకు వెళ్లి నిలబడ్డడు. మొదట తనతో కూలీకి వచ్చినప్పుడు 'అరేయ్ సత్తి' అనేటోడు. చిన్న చిన్న గుత్తలు పట్టి గుత్తెదారు అయినంక పేరు పెట్టి పిలిచిండు. ఇప్పుడు ఏమని పిలవాలో తెలియక ప్రశ్నలు మాత్రమే అడగటం అలవాటు చేసుకున్నడు ఇస్తారి.

" ఏదన్నా పని జెప్పరాదు.......! మూడు నాలుగు రోజులాయె. కైకిలి కరువైపోయింది. దానికి జరమచ్చింది. పిల్లలక్కూడా...మందులు కొందామన్నా పైసల్లేవు " బతిలాడుతున్నట్టు అన్నడు ఇస్తారి.

ఏదో ఊసడింపుగా అందామనుకుని నోరు తెరిచిన సత్తయ్య ఇస్తారి మొకంలకు చూసి మానుకున్నడు. అతని కండ్లల్లో ఉన్న బాధను అప్పుడే గుర్తుపట్టినట్టు లోతుగా చూసిండు.

" బాయి వున్నది. తవ్వుతవా....?"

" ఆ.....తవ్వుత యాడుంది. "

"పదిహేను గజాల బాయి. మొన్నటిదాకా నీళ్లు ఉండెనట. ఈ ఎదురు కాలంల ఎండుక పోయిందట. గజం తవ్వాలెనట."

" ఆ... తవ్వుత. గడ్డపార, తట్టలున్నయిగదా !......."

" ఉన్నయి. అవ్వియాడికి పోవుగని వాళ్లు కైకిలియ్యరట. గుత్తకిత్తనన్నరు. గుత్తకు పట్టుకునేటట్టయితే చెప్పు "అన్నడు.

ఒక అధారం దొరికినట్టయింది ఇస్తారికి. దానిని వదులుకోకూడదనుకున్నడు. సరేనని ఒప్పుకున్నడు.

ఎక్కడికి వెళ్లాలో గుర్తులు చెప్పి ‘ నువ్వు అక్కడికి చేరేలోపు నేను వస్త. మాట్లాడుదాం’ అన్నడు సత్తయ్య.

అతడు చెప్పిన అడ్రస్ వింటుంటే ఏదో గుర్తుకచ్చింది ఇస్తారికి. వెళ్లాలా వద్దా అనే అనుమానం మొదలయింది. మనసు తొక్కులాడుతుంది. సత్తయ్య వేరే పని గురించి కూలీలతో మాట్లాడుతున్నడు.

‘ తను వెళ్లకపోతే అక్కడి పని ఆగది. ఎవలో ఒకలు వెళ్తరు. అందుకని వెళ్లడమే మంచిది ’ అనుకుంటూ ముందుకు నడిచిండు ఇస్తారి.

ఆ ఇల్లు దగ్గరవుతుంటే మరింత నీరసం ముంచుకచ్చింది. ఇంటికి చేరుకునేసరికి సత్తయ్య, చిన్నపరెడ్డి ఉన్నరు. చిన్నపరెడ్డి ఇస్తారిని గుచ్చి గుచ్చి చూస్తున్నడు.

“ యాంటి.....నువ్వ ఇస్తారివి కదబ్బా.......యాంటయ్యా ఇట్లాగైపోయినావు......” యాసగా అంటూ నవ్విండు.

సమాధానంగా చిన్నగా నవ్విండు ఇస్తారి. ‘ అవును....ఇట్లనే ఉంట. మనిషినే గాదు. నా బతుకు గూడా ఇంతే. నా ఎకురం పొలం నీ చేతికి వచ్చినప్పుడే మొదలయింది ’ ఇస్తారిలో ఆలోచనలు.

“ అగో ఈయిన నీకెట్ల తెలుసు ” అడిగిండు సత్తయ్య.

“ మా ఊరే. ఇంటిపక్కనే ఉండేవాడు. అప్పులు ఎక్కువయిపోతే పొలం కొని ఆదుకున్న. లేదంటే అప్పుడే బాల్చితన్నేవాడు.” యాసగా చెప్పిండు రెడ్డి.

ఇస్తారి తలదించుకున్నడు. మాటలు బాయిమీదికి తిరిగినయి. చిన్నపరెడ్డి రెండువందలిస్తనన్నడు.

“ ఇంకేం..... గజంబాయి నాలుగైదు గంటలల్ల తీస్తవు. మట్టిని గుంజుడుకు ఒక ఆడ కూలీని పెట్టుకుంటే సరే. నీకు నూటయాభై మిగులుతయి. అదే కూలీ అయితే డెబ్బయి రూపాయలేనాయె ” సత్తయ్య అన్నడు.

ముందుగా ఏం మాట్లాడలేదు ఇస్తారి. దనదనా చేతాడును బిల్లదూలానికి ముడేసి బాయిలకు దిగిండు. నీళ్లు అట్టికాలి మందమున్నయి. మొరాన్ని గెలికించి చూసిండు. చాపమొరం మెత్తగనే ఉంది. గజం లోతును పొద్దుగూకే లోపే తవ్వచ్చు. పైకి ఎక్కి మరో యాభై ఎక్కువ ఇయ్యిమన్నడు.

యాభైకాదు. యాభైపైసలు గూడ ఎక్కువ ఇయ్యనన్నడు చిన్నపరెడ్డి. బ్యారం కుదిరింది. ‘ మన్ను గుంజుడుకు ఒక ఆడిమనిషి కావాలె. యాభైరూపాయల పనేం ఉండది. తట్టెడు మట్టిని పైకి గుంజి మళ్ళీ తట్టనిండే వరకు కూసుండుడే. ఈ పని నాగవ్వ మా చేత్తది. ఎంత చాతగాకున్నా తట్టెడు మన్ను పైకి గుంజదా ! రేపు కైకిలు దొరికేదేందో దొరుకనిదేందో! ఈంత రెండు వందలు పెడితే గుడిసె మీద కప్పుడుకు జాబుకొనచ్చు ’ ఆగమాగాన ఇంటివైపు నడిచిండు ఇస్తారి.

నాగవ్వ పండుకునే వుంది. అడుగుల చప్పుడుకు కళ్లు తెరిచింది. ‘ ఇయ్యాల్ల గూడా కూలీ దొరుకలేదా? కూసుండి తినుడే గావట్టె. జరంల మన్నువడ. నాలుగు రోజుల నుండి ఇడుత్తలేదు’ నీరసంగా లేచి కూసుంది. నాగవ్వకు బాయి సంగతి చెప్పి రమ్మన్నడు ఇస్తారి.

బాయిలోంచి తట్టను గుంజే ఓపిక లేదని, నిలవడితేనే కాళ్లు వణుకుతున్నయని ముందుగా చెప్పినా, ఆలోచించి అతడి వెంట కదిలింది నాగవ్వ. ముగ్గురు పిల్లలు తినే మందం అన్నాన్ని కింద ఉంచి మిగిలింది ఉట్టిమీద పెట్టింది.

గడ్డపార, పార, ఉలి, సుత్తె మిగిలిన అతారలు అక్కడ రెడీగా వున్నయి. బొక్కెనతో ముందుగా నీళ్లను చేదిపోసిండు ఇస్తారి. గడ్డపార,పారలను బాయిలకు దించిండు. తాడుకు చిక్కాన్ని కట్టి అందులో తట్టను కట్టిండు. అంతదాక అరుగు మీద కూసుండి బంగ్లాను, అందులోని మనుషుల్ని చూస్తుంది నాగవ్వ.

తాడు పట్టుకుని బాయిలకు దిగిండు ఇస్తారి. గడ్డపారతో అడుగును తవ్వుతున్నడు. పొరలు పొరలుగా, పెల్లలు పెల్లలుగా మట్టి విడిపోతుంటే సంతోషం. తట్టను నింపి భార్యను పిలిచిండు. నీరసంగా తట్టను గుంజుతుంది నాగవ్వ. తట్టకు తట్టకు నడుమ నీరసంగా అరుగు నీడకు ఒరిగిపోతుంది.

పొద్దు నెత్తిమీదకచ్చింది. ఎండసూటిగా బాయిలకు పడుతుంది. కప్ప చితుకుల నీటిలో పొద్దు కదులుతుంది. భూమిలో కంటే తన శరీరంలోంచే ఎక్కువ ఊటలు పారుతున్నట్టు గ్రహించిండు ఇస్తారి. ఎత్తిన గడ్డపార భూమిలకు దిగి ‘ఖన్’ మని చప్పుడయింది.

ఇస్తారి గుండె దడీలుమంది.రెండు మూడు జాగల్ల గడ్డపారతో పోట్లు వేసి చూసిండు. అదే చప్పుడు. చుట్టూ పొడిచి చూసిండు. అనుమానంలేదు. అడుగున పరుపు బండ. తవ్విన మట్టిని కుప్ప చేసి అడుగును చేతితో తడిమి చూసిండు. పరుపు బండ గరుకు గరుకుగా తలిగింది. కాళ్లలో సత్తువ ఇంకిపోయింది. నెత్తికి చేతులు పెట్టి నీరసంగా కూలబడిపోయిండు ఇస్తారి.

చిత్తడి చిత్తడిగా ఊరిన నీటితో గోచి తోపుతోపునానింది. ఇప్పటికి పావుగజం దిగింది. శాపమొరం తేలిపోయింది. అడుగున బండవడ్డది. నాలుగు రోజులు తవ్వినా గజంలోతుపోదు. “ఈ గుత్తవద్దు ఈ బాయి వద్దు. కైకిలు ఇస్తే చాలు”.ఆగమాగాన పైకి ఎక్కిండు ఇస్తారి. అతడి ఒంటినిండా బురద, చెమట.

అరుగు మీద నీరసంగా ఒరిగిన నాగవ్వ లేచి కూసుంది. ఇస్తారి మొకంలో కలవరం. ఆమె అడగక ముందే వివరంగా చెప్పిండు ఇస్తారి.

నాగవ్వ వణికి పోయింది. ఆకాశంలో తేలిపోతున్న మేఘాల వైపు దిగులుగా చూసింది. కండ్లెంబడి నీళ్లు తిరిగినయి. ఇప్పుడు ఎట్ల అన్న తొక్కులాట మొదలయింది.

"ఏం లేదు. పొద్దుగూకే దాక తవ్వుదాం. ఎంతలోతైనా దంగని. కైకిలి ఇద్దరికి ఇయ్యిమందాం." ధైర్యం చెబుతున్నట్టుగా అన్నడు ఇస్తారి. ఇద్దరూ సూరునీడకు వచ్చిండ్రు. అదే ముచ్చట రెడ్డికి చెప్పిరమ్మని ఇంట్లోకి పంపింది నాగవ్వ.

ఇంట్లో ఎయిర్ కూలర్ చప్పుడు. చల్లగా ఉంది. నడిస్తేనే మైలపడుతుందేమోనన్నట్టు పాలరాతి నేల. రైతులతో మాట్లాడుతున్న రెడ్డి ఇస్తారి వైపు అసహనంగా చూసిండు. వారిమాటలు వేషాలను బట్టి రైతులని గుర్తించిండు ఇస్తారి. తనను తాను మరిచి కొన్ని క్షణాలు వారివైపు జాలిగా చూసిండు. పొలాలకు రేటు మాట్లాడుతున్నరు.

" అప్పుడే అయిందా......? " విసుగ్గా అడిగిండు రెడ్డి. విషయమంతా చెప్పి పొద్దుగూకే దాకా తవ్వుతమని కూలీ ఇస్తే చాలని అన్నడు ఇస్తారి. రెడ్డి ఒప్పుకోలేదు. గుత్తగుత్తనే అన్నడు. మన్ను మెత్తగా ఉండి పొద్దుగూకక ముందే పని అయితే ఒక్క రోజు కైకిలే ఇస్తనంటే నువ్వు ఒప్పుకుందువా అన్నడు. ఇష్టముంటే గుత్తకు చెయ్యి. లేదంటే వెళ్లిపో! అన్నడు.

ఇస్తారికి ఆ మాటలు బొచ్చెల మెరిసినయి. ఒక సూట్‌కేస్‌లో బట్టలతో మొదటిసారిగా ఊరికి వచ్చిన చిన్నపరెడ్డి గుర్తుకచ్చిండు. పత్తి పంటకని భూములు లీజుకు తీసుకోవడం, ఏడాది రెండేళ్ల తర్వాత లీజు డబ్బు సగానికి సగం తగ్గించడం, కొందరు రైతులు స్వయంగా పత్తి పంట వేయటం, భూమి వరిపంటకు పనికి రాకుండా పోవటం, చివరికి చిన్నపరెడ్డికే భూమిని అమ్మడం అంతా గుర్తుకొచ్చింది.

అతనితో వాదనకు దిగిలాభం లేదనుకుని బయటకు వచ్చిండు ఇస్తారి. అతడి కొరకె ఎదురు చూస్తున్నట్టు "ఏమన్నడు రెడ్డి ఒప్పుకున్నడా ......?" అడిగింది నాగవ్వ.

బాధగా జరిగింది చెప్పిండు ఇస్తారి. నాగవ్వ మొకం వెలవెలపోయింది. "ఇంకేంది......ఇంటికి పోదాంపా. ఇక్కడుండి ఏం జేత్తం. రాయన్న కరుగుతదిగనీ వాడు కరుగడు. " బాధను దిగమింగుకుంటూ చెప్పింది. ఇప్పుడు జరం మరింత ఎక్కువయింది.

" ఇంటికి పోయి ఏంజేద్దాం ! తండ్లాడుదాం. ఇయ్యల్ల రేపు రెండు రోజులైనా సరే. ఇప్పుడు చేతిమీద పని విడిచి పెట్టినమనుకో. రేపైనా పని దొరుకుతదన్న నమ్మకమేంది?" అన్నడు ఇస్తారి.

నాగవ్వకు నిజమే అనిపించింది. కానీ రెండు రోజులకైనా గజం లోతు తవ్వుతమన్న నమ్మకం లేదు. పొరలు పొరలుగా ఉండే బండను ఉలి, సుత్తితో తొలువడం తేలికేం కాదు. తను కూడా తట్టను గుంజలేకపోతుంది. జరంతో నీరసించి కాళ్లు కూలబడిపోతున్నయి.

ఏదో నిశ్చయానికి వచ్చినవాడిలా లేచిండు ఇస్తారి. బొక్కెనతో ఊరిన నీటిని బొట్టు బొట్టుకు చేదిపోసిండు. తట్టలో ఉలి, గన్నును పెట్టి బాయిలకు దించిండు. బిల్లదూలంకు కట్టిన తాడుతో బాయిలకు దిగిండు. గన్ను చప్పుడు బాయిల మోగుతుంది.

నీరసంగా వెళ్లి బాయిలకు తొంగి చూసింది నాగవ్వ. పొగ తప్ప ఏమీ కనిపించలేదు. ఎండకు గచ్చు సుర్రుమంటుంది. గన్ను దెబ్బలు వింటుంటే ఇస్తారి ఎంత పట్టుదలగా ఉన్నడో అర్థమయితుంది.

' బాయిలకు దిగనిచ్చేది కాకుండె. పరుపు బండ వట్టిగపలుగుతదా ! కడుపుల పేగులు నోట్లేకు రావాలె' అనుకుంది నాగవ్వ. కండ్లల్ల తిరిగినట్టయింది. వెళ్లి నీడకు కూసుంది. నీరసంగా వున్నా భయంగా ఉంది. గన్ను దెబ్బలే గుండెలో మారుమోగుతున్నయి.

" పాపం ఆయినకేం సుఖముంది. పుట్టిన్నాడే పెంటల పండవెట్టి ' ఇస్తారి ' అని పేరు పెట్టిండ్రట. బతుకు తినిపారేసిన ఇస్తారు లెక్కనే గావట్టె. బండ ఎట్ల దంగాలె. గజంలోతు ఎన్నడు తవ్వాలే ' అనుకుంటుండగానే బాయిలోంచి కేక వినిపించింది. వెళ్లి చూసింది నాగవ్వ.

"బండ తేలిపోయింది. మల్ల మెత్తటి మొరమే పడ్డది. గంటల గజం లోతు దంగుతది" ఇస్తారి మాటలు వినిపించినయి.

ఏదో ధనం దొరికినంత సంతోష పడిపోయింది నాగవ్వ.

తట్టను గుంజుమని కేకేసిండు ఇస్తారి. నాగవ్వ చేతాడును అందుకుంది. ఒంట్లో శక్తి లేదు. కడుపుల పేగుల నోట్లె కత్తున్నయి. జరంతో రెండు రోజుల నుండి నాలిక మీద మెతుకు లేదు. ఎండ సుర్రుమంటుంది.

నీరసంగా సొలిగి అడ్డం పడబోయి నిలదొక్కుకుంది నాగవ్వ. అప్పటికే చేతాడు పట్టు తప్పి చేతుల్లోంచి జారిపోయింది.

రెండు నిలువుల ఎత్తు మీద నుంచి మట్టి తట్ట బాయిలకు దూసుకుపోయింది.

( ప్రజాశక్తి ఆదివారం ఆగష్టు- 2001)

కథా నిలయం
6187
శ్రీకాకుళం